రైతుబజార్లు అధ్వానం..

- కారుతున్న దుకాణాలు
- టార్పాలిన్లతో రక్షణ
- సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న రైతులు


షెడ్లపై వేసిన టార్పాలిన్లు

విజయనగరం ఫోర్ట్: రైతు బజార్లను నేనే ఏర్పాటు చేశాను... వాటిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది, అభివృద్ధి చేసిన ఘనత నాదే.. అని సీఎం చంద్రబాబు నాయుడు గొప్పులు చెప్పుకుంటున్నారు. కాని వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. రైతుబజార్లు కనీస సౌకర్యాలు లేక కొట్టుమిట్టుడుతున్నాయి. పాత ఎంఆర్ ఆస్పత్రి వద్ద ఉన్న రైతు బజార్ పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. బజార్ ఏర్పాటు చేసి సుమారు 25 సంవత్సరాలు పూర్తయినా ఇంతవరకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో తమ ఉత్పత్తులను విక్రయించడానికి రైతులు... కొనుగోలు చేసేందుకు వస్తున్న వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. 1999లో ఏర్పాటు చేసిన ఈ రైతుబజార్‌ను ఇంతవరకు అభివృద్ధి చేయకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

టార్పాలిన్‌లే దిక్కు..

సుమారు 25 సంవత్సరాల కిందట నిర్మించిన షెడ్లు పూర్తిగా పాడయ్యాయి. వాటి స్థానంలో ఇంతవరకు కొత్త షెడ్లు నిర్మించలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో టార్పాలిన్లు వేసుకుని రైతులు వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో వర్షం వస్తే కూరగాయాలు, ఆకుకూరలు తడిచిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రైతుబజార్‌లో 65 దుకాణాలున్నాయి. దాదాపు అన్ని దుకాణాలకు సంబంధించిన షెడ్లు పాడయ్యాయి. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వారు వాపోతున్నారు. అసౌకర్యాల నడుమ పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.


కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

వేరే చోటుకు మారుస్తాం..

రైతుబజార్‌ను వేరే చోటుకు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ తర్వాత ఇక్కడ కొత్త షెడ్లు నిర్మిస్తాం. కొద్ది రోజుల్లోనే రైతుల ఇబ్బందులను తొలగిస్తాం. – ఎల్. ఉమామహేశ్వరావు, ఎస్టేట్ అధికారి, ఎంఆర్ రైతుబజార్

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం..


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో భాగంగా నవంబర్ 1న నిర్వహించనున్న రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు డి. రాము, పీడీఎస్‌ఓ జిల్లా కన్వీనర్ బి.రాకేష్ పిలుపునిచ్చారు. విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, 32 మంది బలిదానాల ఫలితంగా ఏర్పడిన ఉత్తరాంధ్ర ఆయువు పట్టు అయినా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పనంగా అమ్మేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు 21000 టన్నులు ఉత్పత్తి చేయాల్సిన ప్లాంట్ ప్రస్తుతం ఆరు వేల టన్నులు కూడా ఉత్పత్తి చేయలేకపోతోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవడానికి నవంబర్ 1న విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, పీడీఎస్‌ఓ అధ్యక్షుడు సోమేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి. రమేష్, శిరీష, జిల్లా కమిటీ సభ్యులు సోమేష్, భారతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హమాలీ చార్జీలు చెల్లింపు


రైతులకు నగదు అందజేస్తున్న సంస్థ సీఈఓ ప్రభాకర్, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలసలో 2020 – 21 సంవత్సరానికి సంబంధించి రైతులకు మంజూరు చేయాల్సిన హమాలీ చార్జీలను ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సంస్థ సీఈఓ ఎ. ప్రభాకర్ శనివారం అందజేశారు. గ్రామానికి చెందిన 224 మంది రైతులకు క్వింటాకు 25 రుపాయలు చొప్పున 2,64,690 రుపాయలు అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పతివాడ శ్రీనివాసరావు, ఇజ్జిరోతు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

విజయనగరం అర్బన్: శ్రీచైతన్య విద్యాసంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'నాలెడ్జ్ అస్సెస్మెంట్ టెస్ట్'లో స్థానిక రింగ్ రోడ్డులో గల శ్రీచైతన్య టెక్నో స్కూల్ బ్రాంచ్ నుంచి 258 మంది.. బ్రాంచ్-2 నుంచి 39 మంది ప్రతిభ చూపి లెవిల్-1కి అర్హత పొందినట్లు పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకుడు.వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, డీన్‌లు సూర్యచంద్ర, సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ విక్రమ్, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

డెంకాడలో పోలీసుల ర్యాలీ


ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ర్యాలీగా వస్తున్న పోలీసులు, అధ్యాపకులు, విద్యార్థులు

డెంకాడ: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసులు ర్యాలీలో పాల్గొంటూ, అమరవీరులకు జోహర్లు అంటూ నినాదాలు చేశారు. అంతకు ముందు కళాశాలలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అలాగే డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించగా.. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎ.సన్యాసినాయుడు, సిబ్బంది, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న డీఆర్‌ఓ


డీఆర్‌ఓకు అమ్మవారి శేషవస్త్రం వేస్తున్న సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లిని నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వేదాశీస్సులతో పాటు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిరిష్కరిస్తున్న డీఈఓ మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం రాష్ట్ర కమిటీ పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన గణిత దీప్తి అనే పుస్తకాన్ని డీఈఓ యు.మాణిక్యంనాయుడు శనివారం తన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలు మాట్లాడుతూ.. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెరప్పారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఓను ఫోరం సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు ఎం. వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి సన్యాసిరాజు, ఏపీ గణిత ఫోరం రాష్ట్ర సలహాదారుడు సిద్ధాంతం త్రినాథరావు, జిల్లా అధ్యక్షుడు వాక చిన్నంనాయుడు, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

మిగిలిన పనులు పూర్తి చేయండి

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: టిడ్కో గృహ సముదాయాల వద్ద మిగిలి ఉన్న చిన్న, చిన్న పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు సకల సదుపాయాలు కల్పించాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని సోనియానగర్, సారిపల్లి ప్రాంతాలలో ఉన్న టిడ్కో గృహ సముదాయాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సోనియానగర్ వద్ద ఏర్పాటు చేసిన సీవేజ్ ప్లాంట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. టిడ్కో గృహ సముదాయాలకు వెళ్లే విధంగా 30 అడుగుల సీసీ రోడ్డును త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అక్కడ నివసిస్తున్న కొంతమంది గృహస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో డీఈ శశిధర్, ఏఈ రాజీవ్‌గాంధీ, టీపీఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, ఏఈ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


టిడ్కో గృహ సముదాయం వద్ద అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ నల్లనయ్య

నిధులు మంజూరు చేయండి...

పూసపాటిరేగ: మండలంలోని గుంపాం తుఫాన్ షెల్టర్ పాడైందని, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. షెల్టర్ పాడైన విషయాన్ని అధికారులకు తెలియజేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి షెల్టర్‌ను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

విజయనగరం క్రైమ్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలిగేలా వారికి కౌన్సిలింగ్ చేయాలన్న ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో శనివారం ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. రౌడీషీట్ నమోదైన వ్యక్తులను స్టేషన్లకు పిలిపించుకుని వారి ఎక్కడున్నారు.. ఏయే వృత్తులు చేస్తున్నారో తెలుసుకున్నారు. భవిష్యత్‌లో చెడు పనుల జోలికి వెళ్లకుండా ఉండేలా అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

ఐఏఎస్ యాప్ బాధితుల ఫిర్యాదు

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అధిక డబ్బులకు ఆశపడి ఇండియన్ అడ్వర్టైజ్‌మెంట్ సర్వీస్ (ఐఏఎస్) అనే ఆన్‌లైన్ కంపెనీకి రూ.8,90,450 చెల్లించారు. ఎన్ని రోజులు గడిచిన డబ్బులు తిరిగి రాకపోవడంతో చేసేదేమి లేక శనివారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్‌వీ ప్రభాకర్ తెలిపారు.

నైపుణ్యాలు కీలకం..

విజయనగరం అర్బన్: తరగతి గదుల్లో నేర్చుకునే సూత్రాలకు, వాస్తవ ప్రపంచంలో ఉండే పరిస్థితులకు మధ్య ఉన్న అంతరాన్ని తొలగించేందుకు నైపుణ్యాలు కీలకమని ఓపెన్ టెక్స్ సీనియర్ క్వాలిటీ ఇంజినీర్ వీఎస్ చైతన్య అన్నారు. గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'గ్రాడ్యుయేట్స్ కోసం అవసరమైన నైపుణ్యాలు, వ్యూహాలు' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తమ భవిష్యత్‌లో ముందడుగు వేయాలంటే నైపుణ్యాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం చైతన్యను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వేణుమాధవరావు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందనలు

విజయనగరం క్రైమ్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన పోలీస్ స్కూల్ విద్యార్థి పి. జైగణేష్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం అభినందించారు. గజపతినగరం పెదకాద హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్ -17 అథ్లెటిక్స్ విభాగంలో హైజంప్ పోటీల్లో పి.జైగణేష్ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపియ్యారు. ఈ మేరకు విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య, పీఈటీ రమ, ఆర్‌ఐ గోపాలనాయుడు, ఆర్ఎస్సై వరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

చీపురుపల్లి: స్థానిక సీహెచ్‌సీలో మానవీయతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 18మంది యువకులు రక్తదానం చేశారు.మానవీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవ స్థాపకుడు బి.వి.గోవిందరాజులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యంగగా ఉన్న 18 నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు వారు రక్తదానం చేయవచ్చని చెప్పారు. అపోహలు వీడి యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆస్పత్రి వైద్యసిబ్బంది, బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వ్యాపార లావాదేవీలు సులభతరం


మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య, హాజరైన వివిధ రంగాలకు చెందిన వ్యాపారులు

విజయనగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంలో వ్యాపార లావాదేవీలు సులభతరంగా నిర్వహించుకోవచ్చని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య సూచించారు. శనివారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం ద్వారా క్రయ, విక్రయాలు విస్తృతం చేసి ఆర్థిక సాధికారతను సాధించుకోవాలని సూచించారు. ఇందుకోసం నూతన విధానం అమల్లోకి వచ్చిందని.. దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌లో సులభతరంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం డీడీ మధుసూదనరెడ్డి, మెప్మా ఇన్‌చార్జ్ పీడీ కె. శ్రీనివాసరావు, టీపీఆర్‌ఓ సింహాచలం, చాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షుడు వెంకటాచలం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రెసిడెంట్ ముచ్చు రామలింగేశ్వరరావు, హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, బాలాజీ వస్త్ర మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విజయనగరం క్రైమ్: అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసు ఉద్యోగులు, వారి పిల్లలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఏవీ లీలారావు, ఆర్‌ఐ వీఆర్‌కే చౌదరి, ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న అదనపు ఎస్పీ సౌమ్యలత

సర్పంచ్‌లకే ఉపాధి పనులు..


సమావేశమైన వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్‌లు

నెల్లిమర్ల: గ్రామాల్లో చేపట్టనున్న ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ పనులు (వెండార్ ఐడీ వర్క్స్) సర్పంచ్‌లకే అప్పగించాలని మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు, సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సౌత్‌సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యుడు అంబల్ల శ్రీరాములునాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం మాట్లాడుతూ.. తాజాగా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూటమి పార్టీల నాయకులకు అప్పగించడం చట్ట వ్యతిరేకమన్నారు. 2005 ఉపాధిహామీ చట్టం ప్రకారం గ్రామాల్లో చేపట్టే పనులు సర్పంచ్‌లకే అప్పగించాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం పనులు అప్పగించకుంటే ఆందోళన తప్పదన్నారు. ఎంపీడీఓ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

పోలీస్ వ్యవస్థ కీలకం


ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పీటీసీ సిబ్బంది

- పీటీసీ ప్రిన్సిపాల్ రామచంద్రరాజు

విజయనగరం క్రైమ్: పోలీస్ వ్యవస్థ సమాజానికి ఎంతో కీలకమని పీటీసీ ప్రిన్సిపాల్ డి.రామచంద్రరాజు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్థానిక పీటీసీ గ్రౌండ్‌లో విద్యార్థులకు ఆయుధాలు, వాటి పనితీరు, పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ పోలీస్ చేసే సేవలు, త్యాగాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అప్పారావు, డీఎస్పీలు రామారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్ఆర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గోపీనాథరెడ్డి

విజయనగరం ఫోర్ట్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గోపీనాథరెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుడివాడలో ఎస్ఆర్ కార్పొరేట్ వేరేహౌస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైద్యం ఖరీదైన ప్రస్తుత తరుణంలో ఉచిత వైద్యశిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం మెడికవర్ ఆస్పత్రి వైద్యులు బి.లక్ష్మి, కొండమ్మ, ఎస్. జయసాయి చందు, శ్రవణ్‌కుమార్, ఎంఎస్ఎల్ రాజు, తదితరులు సుమారు 400 మంది రోగులను పరీక్షించి, అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎల్ఎస్ ప్రసాద్, కె. వెంకట ఉదయ్‌కుమార్, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు రాజు

పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్


బాంబ్ బాక్స్‌లను కనిపెడుతున్న డాగ్

విజయనగరం క్రైమ్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీస్ డాగ్స్ చేసిన విన్యాసాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. హ్యాండలర్స్ కమాండ్స్‌కు అనుగుణంగా డాగ్స్ సెల్యూట్, మార్చ్, కూర్చోవడం, రోలింగ్ చేయడం వంటి విన్యాసాలు చేశాయి. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, అధికారులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం పంచారామాల సందర్శనకు యాత్రా స్పెషల్స్ పేరిట ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ శనివారం తెలిపారు. ఈమేరకు యాత్రా స్పెషల్స్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పంచారామాల సందర్శనలో భాగంగా అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోటకు ఎస్.కోట నుంచి పల్లెవెలుగు, ఆల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నవంబర్ 3, 10, 17, 24 (ఆదివారాలు) సాయంత్రం 4 గంటలకు బయలుదేరి, తిరిగి మంగళవారం వేకువ జామున ఎస్.కోట డిపో కు చేరుకుంటాయన్నారు. ఎక్స్‌ప్రెస్‌కు రూ.1500, ఆల్ట్రా డీలక్స్‌కు రూ.1950, పల్లెవెలుగు బస్సులకు రూ.1150 చార్జీలుగా నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. అయ్యప్ప భక్తులకు ఎస్.కోట నుంచి శబరిమల యాత్రకు వెళ్లేందుకు 7రోజుల యాత్ర, 11 రోజుల యాత్రకు స్వాములు కోరిన విధంగా బస్సులు ఇస్తామన్నారు. కార్తీకమాసం సందర్భంగా విశాఖదర్శిని, అరుకు దర్శిని, పుణ్యగిరి, లంబసింగి, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖ లింగం, టెక్కలి, రావివలస వెళ్లేందుకు, పిక్నిక్ స్పెషల్స్‌గా విద్యార్థులకు అందుబాటు ధరలో బస్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు. సుశిక్షితులైన డ్రైవర్ల పర్యవేక్షణలో, సురక్షితమైన ప్రయాణం చేసేందుకు ఆర్టీసీ నమ్మకమైన ప్రజాసంస్థగా గుర్తించాలని కోరారు. యాత్రలు చేయదల చిన వారు, లేదా బస్సులు కావాల్సిన వారు ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఫోన్ నంబర్ 73829 23679ను లేదా డిప్యూటీ సూపరింటెండెంట్ ఫోన్ నంబర్ 94905 83579ను సంప్రదించాలని సూచించారు.


యాత్రా స్పెషల్స్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ డీఎం రమేష్, ఉద్యోగులు